

రూ.2 లక్షల విరాళం


తాళ్లరేవు: సుంకరపాలెంలో పునర్నిర్మిస్తున్న ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామివారి ఆలయంలో ధ్వజస్తంభం ఏర్పాటుకు కర్నీటి ఓంకార్ (జార్జీపేట) రూ.2 లక్షల విరాళం అందజేశారు.



600 సెల్‌ఫోన్ల రికవరీ

కాకినాడ క్రైం: దొంగతనానికి గురైన 600 సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్టు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. వీటి విలువ రూ.78 లక్షలు అన్నారు.

35 వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం సాయంత్రం 35,615 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.70 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 4,100 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

పులగుర్తలో ఆల్‌ఇండియా సర్వీసెస్ ట్రైనీ అధికారులు



పులగుర్తలో చేనేత సొసైటీ పనితీరును అడిగి తెలుసుకుంటున్న ట్రైనీ అధికారులు

పెదపూడి: పులగుర్త గ్రామంలో బుధవారం ఆల్ ఇండియా సర్వీసెస్ ట్రైనీ అధికారులు క్షేత్ర స్థాయి సందర్శన చేపట్టారు. ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా డీఆర్‌డీఏ పీడీ ఎన్.వీ.వీ.ఎస్.మూర్తి విలేకరులతో మాట్లాడుతూ ముస్సోరిలోని లాల్‌బహదూర్‌శాస్త్రి నేషనల్ అకాడమి ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌కు చెందిన 99వ ఫౌండేషన్‌కు చెందిన ట్రైనీ ఐఏఎస్, ఐపీఎస్, ఆల్‌ఇండియా ఫారెస్, ఫారెస్ట్ సర్వీసెస్ అధికారులు 10 మంది తూర్పుగోదావరి జిల్లా పరిస్థితులు అధ్యయనం చేయడానికి వచ్చారన్నారు. ఈ నెల 9న జిల్లాకు వచ్చిన వారు 16వ తేదీ వరకు పర్యటిస్తారన్నారు. దీనిలో భాగంగా అనపర్తి మండలం పులగుర్తలో చేనేత సొసైటీ పనితీరును పరిశీలించారన్నారు. వారు జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం, ఉపాధి హామీ, ఉపాధి అవకాశాలు వంటి వాటిపై అధ్యయనం చేస్తారన్నారు. ఈ బృందానికి రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్‌ను ఇన్‌చార్జిగా, తనను నోడల్ ఆఫీసర్‌గా నియమించారన్నారు.

పీఎం-కుసుమ్ పథకాన్ని వినియోగించుకోవాలి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం-కుసుమ్ (ప్రధానమంత్రి కిసాన్ ఊర్జ సురక్ష యావం ఉత్థాన్ మహాభ్యాన్) కాంపోనెంట్-ఏ పథకాన్ని అభ్యుదయ రైతులు సద్వినియోగం చేసుకోవాలని సీటీఆర్ఐ పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ డివిజన్ హెడ్ డాక్టర్ కేవీఎస్ ప్రసాద్ సూచించారు. బుధవారం కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం, నేషనల్ స్కిల్స్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా(ఎన్ఎస్ఎఫ్ఐ), అగ్రికల్చర్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో స్థానిక సీటీఆర్ఐ సమావేశ మందిరంలో అవగాహన సదస్సు ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఎన్ఎస్ఎఫ్ఐ అధికారులు భాను, గౌతమ్‌లు మాట్లాడుతూ పీఎం-కుసుమ్ కాంపోనెంట్-ఏ పథకంలో సౌరశక్తి ఉత్పాదకత, భూమి విస్తీర్ణం, చౌడు భూములలో సౌర శక్తి ప్యానల్స్ ఏర్పాటు వలన రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఇండ్లపైన సౌర శక్తి ప్యానల్స్ వల్ల గృహపరంగా విద్యుత్ ఖర్చును తగ్గించుకోవచ్చని తెలిపారు. పంటలకు పనికిరాని భూములలో ముఖ్యంగా చౌడు, బీడు భూములలో సౌర శక్తి ప్యానల్స్‌ను ఏర్పాటు చేసుకొని ఆఫ్ గ్రిడ్ పద్ధతిలో విద్యుత్తును ఉత్పాదన చేసుకోవచ్చన్నారు. ఒక మెగావాట్‌కి నాలుగు ఎకరాల వరకు అవసరమవుతుందని, ఒక మెగావాట్ ప్లాంట్ నిర్మించుకోవడానికి 3.5 నుంచి 4 కోట్ల వరకు ఖర్చవుతుందన్నారు. ప్రస్తుతానికి ఈ పథకానికి ఎటువంటి ప్రభుత్వ రాయతీలు అందుబాటులో లేవని ప్రాజెక్టు డెవలపర్లు ద్వారా సౌర విద్యుత్ ప్లాంట్ల సంస్థాపన, నిర్వహణలో సహాయం అందజేస్తారన్నారు. ఎంఎస్ఎంఈ గా నమోదు చేసుకోవడం ద్వారా క్రెడిట్ గ్యారెంటీ ప్యాకేజీని వాటి ప్రయోజనాన్ని పొందవచ్చన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, డా.కెవిఎస్ ప్రసాద్, కృషివిజ్ఞానకేంద్రం హెడ్ డా.వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ రైతులకు లాభసాటిగా ఈ పథకం అమలు అవ్వాలని కోరారు. కేవీకే స్టాఫ్ జేవియర్ సత్యవాణి, విజయవర్ధన్, రత్నాజీ, ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా అభ్యుదయ రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల సీఈవోలు, డైరెక్టర్లు, సభ్యులు, ఎన్జీవో సభ్యులు, రైతు మహిళలు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనపై దృష్టి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): హౌసింగ్ కాలనీల్లో విద్యుత్, తాగునీటి సరఫరా, గార్బేజ్ సేకరణపై కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హౌసింగ్ నిర్మాణాలు, మౌలిక సదుపాయాలు స్థితిగతులపై సమన్వయ శాఖల అధికారులతో, హౌసింగ్ క్షేత్ర స్థాయి అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ హౌసింగ్ లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధ్వర్యంలో విద్యుత్ లైన్లు, రహదారుల అభివృద్ధి, తాగునీరు, అవసరాలకు అనుగుణంగా నీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ వంటి మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం మూడు అంశాల ప్రాతిపదికన పనులను చేపట్టడం, పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. మైనర్ పనులను సంబంధిత గ్రామ పంచాయతీ అధ్వర్యంలో చేపట్టాలన్నారు. హౌసింగ్ లే అవుట్ లలో మరిన్ని ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు.

ప్రీమియంకు మంగళం

- ఉచిత పంటల బీమాను అటకెక్కించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు?
- ప్రీమియం రైతులే చెల్లించేలా ఉత్తర్వులు
- బడ్జెట్‌లో స్పష్టత ఇచ్చిన సర్కారు
- అన్నదాతపై అదనపు భారం
- డిసెంబరులోగా చెల్లించాలని గడువు
- జిల్లావ్యాప్తంగా 1.65 లక్షల మంది రైతులు
- ఏటా ఖరీఫ్, రబీలో 87,500 హెక్టార్లలో వివిధ రకాల పంటల సాగు
- క్రమం తప్పకుండా ప్రీమియం కట్టిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న సచివాలయ సిబ్బంది (ఫైల్)



సాక్షి, రాజమహేంద్రవరం: ప్రకృతి విపత్తుల సమయంలో పంటలు దెబ్బతిన్న రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పరిహారం అందించడంలో 'ఉచిత పంటల బీమా' కీలక భూమిక పోషిస్తుంది. బీమా చేయించుకున్న రైతులకు పరిహారం అందుతుంది. పంటల సాగుకోసం బ్యాంకు, సొసైటీల ద్వారా రుణాలు తీసుకున్న రైతులకు సంబంధిత సంస్థలే బీమా సొమ్ము చెల్లిస్తాయి. బీమా పొందాలంటే రైతువాటాగా నిర్ధారించిన ప్రీమియం సొమ్ము చెల్లించాల్సి ఉంది. అంతటి ప్రాధాన్యం సంతరించుకున్న 'ఉచిత పంటల బీమా'కు కూటమి ప్రభుత్వం మంగళం పాడే దిశగా అడుగులు వేసింది. ప్రీమియం సొమ్ము రైతులే చెల్లించాలన్న నిబంధన తెర పైకి తెచ్చింది. తాజాగా కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తొలి బడ్జెట్ ఈ విషయాన్ని వెల్లడించింది. బీమా ప్రీమియం సొమ్ము భారాన్ని రైతులపై మోపింది. ఈ పరిణామం రైతుల్లో ఆవేదన నింపుతోంది. అప్పులు చేసి పంటలు సాగు చేస్తుంటే.. ప్రభుత్వం మాత్రం తమకు ఏ మాత్రం ప్రోత్సాహం అందించడం లేదని ఆవేదన చెందుతున్నారు.

జిల్లాలో ఇలా..

తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో సుమారు 83,068 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగవుతాయి. ఇందులో అత్యధికంగా వరి 77,817 హెక్టార్లు, మినుములు 2,595 హెక్టార్లు, చెరకు 1,480, వేరుశనగ 258, పత్తి 502, కందులు, పెసలు, పసుపు 416 హెక్టార్లలో సాగవుతాయి. పంట బీమా వర్తించాలంటే ప్రతి రైతు ప్రీమియం చెల్లించాల్సిందే. సహకార బ్యాంకులతో పాటు వాణిజ్య బ్యాంకుల్లో రుణాలు తీసుకునే రైతుల నుంచి ఆయా బ్యాంకులే బీమా ప్రీమియంను రైతుకు ఇచ్చే రుణం నుంచి మినహాయించుకుంటాయి. రుణాలు తీసుకోని రైతులకు పంటల బీమా వర్తించాలంటే ముందుగా బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.

ప్రీమియం చెల్లింపులు ఇలా..

2024–25 రబీ సీజన్‌కు ప్రభుత్వం గుర్తించిన పంటలకు బీమా ప్రీమియం చెల్లింపునకు ఇటీవల ఉత్తర్వులు వెలువరించింది. ఇందులో భాగంగా జిల్లాలో వరి, మినుములు, పెసలు, జీడిపప్పు పంటల బీమా ప్రీమియం చెల్లించాలని పేర్కొంది.

గత ప్రభుత్వంలో మంజూరు చేసిన ఇన్‌పుట్ సబ్సిడీ

పంట	వర్తింప చేసిన ఇన్‌పుట్ సబ్సిడీ (హెక్టారుకు)
వరి, వేరుశనగ, పత్తి, చెరకు	రూ.17,000
మొక్కజొన్న	12,500
మినుములు, పెసలు, శనగలు, పొద్దుతిరుగుడు, పొగాకు	10,000
జొన్న	8,500

హెక్టారు వరి పంట విలువ రూ.1.05 లక్షలుగా నిర్ధారించి రైతు వాటాగా 1.5 శాతం అంటే రూ.1,575 ప్రీమియం చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తం డిసెంబర్ 31లోపు చెల్లించాలి. హెక్టారు మినుములు, పెసలు విలువ రూ.50 వేలు కట్టి 1.5 శాతం వంతున రూ.750 ప్రీమియం డిసెంబరు 15 నాటికి చెల్లించాలని నిబంధనలు విధించింది. హెక్టారు జీడి తోటకు రూ.75 వేలుగా నిర్ధారించి ఇందుకు 5 శాతం వంతున అంటే రూ.3,750 ప్రీమియం నవంబర్ 15లోపు చెల్లించాలని పేర్కొంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇందులో ఏ పంటకూ ఒక్క రూపాయి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేకుండానే పంటల బీమా అమలు చేసింది.

రైతులపై భారం

కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బీమా ప్రీమియం భారం రైతులపై పడనుంది. వచ్చే రబీ సీజన్ నుంచి పంట సాగుచేసే ప్రతి రైతు పంటల బీమా పొందాలంటే ప్రీమియం చెల్లించాల్సిందే. గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క రూపాయి కూడా చెల్లించని రైతులు ఇప్పుడు ప్రీమియం చెల్లించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటల సాగుకు ఇప్పటికే పెట్టుబడులు అందక అప్పులు చేసి వ్యవసాయానికి సిద్ధమవుతున్నారు. ఇలాంటి సమయంలో బీమా భారం తమపై మోపడం ఏంటన్న ప్రశ్న కర్షకుల్లో ఉత్పన్నమవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మళ్లీ రైతులకు కష్టాలు మొదలయ్యాయని నిట్టూరుస్తున్నారు. ఇప్పటికే రైతుభరోసా పథకంలో ఏటా అందే పెట్టుబడి సాయం రూ.13,500 అందకుండా పోయాయి. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఏటా రూ.20,000 ఆర్థిక సాయం ఎప్పుడు వస్తుందో స్పష్టత లేదు. ఇలాంటి సమయంలో ప్రీమియం చెల్లించడం కష్టంగా ఉందని ఆవేదన చెందుతున్నారు.

రూ.14.80 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ

మిచాంగ్ తుపాను ప్రభావంతో తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా మొత్తం 15,615 మంది రైతులకు సంబంధించి 10,487.02 హెక్టార్లలో ఉద్యాన, వ్యవసాయ పంటలు దెబ్బతిన్నట్లు అప్పట్లో వ్యవసాయ అధికారులు నిర్ధారించి ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వం మరో ఆలోచన చేయకుండా రైతులకు అండగా నిలిచింది. నష్టపోయిన పంటలకు సాయంగా రూ.14.80 కోట్ల పెట్టుబడి రాయితీ మంజూరు చేసింది.

రైతులే చెల్లించాలి



ఉచిత పంటల బీమా పొందాలంటే ప్రీమియం రైతులే చెల్లించాల్సి ఉంది. ఈ మేరకు ప్రభుత్వం వెలువరించిన ఉత్తర్వులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ ప్రక్రియ రైతులకు అలవాటైతే క్రమం తప్పకుండా చెల్లిస్తారు. తద్వారా ప్రకృతి విపత్తుల సమయంలో పంటలు దెబ్బతిన్నా పరిహారం పొందే వీలుంటుంది. నిర్దేశించిన గడువులోగా ప్రతి రైతూ ప్రీమియం చెల్లించాలి.

– ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయ అధికారి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు అండగా..

వ్యవసాయ రంగాన్ని, రైతులను ఆదుకునే దిశగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2019 ఖరీఫ్ సీజన్ నుంచి ఉచిత పంటల బీమా పథకాన్ని తీసుకొచ్చింది. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఈ–క్రాప్ నమోదు ప్రామాణికంగా ఉచిత పంటల బీమాను అమలు చేశారు. రైతులు సాగు చేసే మొత్తం విస్తీర్ణానికి చెల్లించాల్సిన ప్రీమియంను ప్రభుత్వమే కట్టేలా చర్యలు తీసుకున్నారు. సాగు చేసిన ప్రతి ఎకరాకు బీమా పథకం వర్తించడంతో పంటలకు నష్టం వాటిల్లిన ప్రతి సందర్భంలోనూ రైతులు పూర్తిగా నష్టపరిహారం అందుకునే వారు. కౌలు రైతులకు సైతం పరిహారం అందించారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతుల ఖాతాలకే జమ చేసేవారు.

యువకుల మృతి దురదృష్టకరం



తాడిపర్రులో సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహం వద్ద ఏపీ, తెలంగాణ గౌడ సంఘం నాయకులు

మృతుల కుటుంబీకులను పరామర్శించిన ఏపీ, తెలంగాణ గౌడ సంఘం నాయకులు

ఉండ్రాజవరం: విద్యుదాఘాతంతో యువకులు మృతి చెందడం దురదృష్టకరమని ఏపీ, తెలంగాణ గౌడ సంఘం నాయకులు అన్నారు. మండలంలో తాడిపర్రు గ్రామంలో ఇటీవల సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా ప్లెక్సీలు కడుతూ విద్యుదాఘాతంతో మరణించిన వారి కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల గౌడ సంఘం నాయకులు బుధవారం తాడిపర్రులో సంతాప సభ ఏర్పాటు చేసి మృతులకు నివాళులు అర్పించారు. తొలుత సర్దార్ పాపన్న గౌడ విగ్రహానికి పూలమాలలు వేశారు. విద్యుదాఘాతంతో మృతి చెందిన యువకులు బొల్లా వీర్రాజు, మారిశెట్టి మణికంఠ, పామర్తి నాగేంద్ర, కాసగాని కృష్ణల కుటుంబాలకు వివిధ ప్రాంతాల గౌడ సంఘాల నుంచి సేకరించిన విరాళాలను ఒక్కొక్కరికి రూ.2.75 లక్షల చొప్పున రూ.11 లక్షలతో పాటు ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కోమటి అనంతరావుకు రూ.1.50 లక్షల ఆర్థిక సహాయం అందించారు. ఏపీ, తెలంగాణ గౌడ సంఘం జాతీయ అధ్యక్షుడు మోర్ల ఏడుకొండలు, గౌడ్ సంఘం స్టేట్ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ తాతా కృష్ణారావు, రాష్ట్ర గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టా వీరబాబు గౌడ్, తాడిపర్రు ఎంపీటీసీ సభ్యుడు కట్టా వెంకటేశ్వరరావు, మారిశెట్టి సూరిపండు, మారిశెట్టి చిన్నయ్య, వేముల సత్యనారాయణ, వెలిగట్ల వీరవెంకట రాజు, గౌడ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

లింకు లేకుంటే రాయితీ లేనట్టే!

- బ్యాంకు ఖాతాకు ఎన్‌పీసీఐ లింక్ తప్పనిసరి చేసిన కేంద్రం
- ఈ నెల 6 నుంచి ప్రారంభమైన ప్రక్రియ



బొమ్మూరు గ్రామసచివాలయం-2లో ఖాతాదారులకు ఎన్‌పీసీఐ లింకు చేస్తున్న సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సంక్షేమ పథకాల ద్వారా అందించే రాయితీలకు ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) లింక్ తప్పనిసరి చేశాయి. ఇటీవల వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి ఎన్‌పీసీఐ లింకు ఉన్న ఖాతాలు లేకపోవటంతో ప్రభుత్వాల నుంచి వారికి పథకాలు అందకుండా పోయాయి. దీనిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థల పరిధిలో ఎన్‌పీసీఐ లింకులు లేని ఖాతాల జాబితాలను ఆయా ప్రాంతాల వారీగా పంపించింది. ఎన్‌పీసీఐ నిబంధనల ప్రకారం మనుగడలో లేని ఖాతాలను తెరిపించేలా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. త్వరితగతిన పునరుద్ధరణ పూర్తి చేయాలని స్పష్టం చేసింది. జిల్లాలో గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలో నివాసముంటున్న వారికి బ్యాంకు ఖాతాలు ఉన్నప్పటికీ వాటికి ఎన్‌పీసీఐ లింకు లేనట్టు ప్రభుత్వం గుర్తించింది. ప్రతి గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో లబ్ధిదారుల ఖాతాలను డిజిటలైజేషన్ చేయాలని ఈ నెల 6వ తేదీన కేంద్రం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీని ప్రకారం లబ్ధిదారులతో పాటు 18 ఏళ్లు నిండివారంతా పోస్టాఫీసుల్లో కొత్త ఖాతాలను తెరవాలి. దీనిపై ఆయా సచివాలయాల పరిధిలో సచివాలయ సెక్రటరీ, వెల్ఫేర్, మహిళా సంరక్షణ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, సర్వేయర్లు, అగ్రికల్చర్ సిబ్బందిని సిద్ధం చేశారు.

బ్యాంక్ ఖాతాకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి

ప్రభుత్వం నుంచి మంజూరయ్యే ఏ సంక్షేమ పథకమైనా లబ్ధిదారులకు నేరుగా అందాలంటే బ్యాంకు ఖాతా మనుగడలో ఉండాలి. కొందరికి రెండు, మూడు బ్యాంక్ ఖాతాలు ఉండి వాటిలో కొన్ని వినియోగంలోకి లేకపోవడంతో సమస్యలు వస్తున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించి మనుగడలోని లేని ఖాతాల వివరాలు పునరుద్ధరించుకునేలా చర్యలు చేపట్టింది. జిల్లాలో 2,59,182 మందికి పైగా ఖాతాదారులకు ఎన్‌పీసీఐ లింక్ లేనట్టు గుర్తించాం. వారందరికీ సమాచారం అందించి లింక్ చేసుకోవాలని సూచిస్తున్నాం. పోస్టల్ డిపార్ట్‌మెంట్ ద్వారా గ్రామ, వార్డు సచివాలయాల్లో స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తున్నాం. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– వీణాదేవి, డీఎల్‌డీవో, రాజమహేంద్రవరం

ఫిరాయింపుల్లో పద్మశ్రీ

- నమ్మి పదవిస్తే నమ్మక ద్రోహం
- పదవికి రాజీనామా ప్రకటన
- గన్‌మెన్, ప్రొటోకాల్ వదలరెందుకు?
- అధికారిక కార్యక్రమాల్లో ప్రత్యక్షం



చెత్త నుంచి బయోగ్యాస్ ఉత్పత్తి చేసే ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్సీ హోదాలో పాల్గొన్న పద్మశ్రీ (వృత్తంలో)

సాక్షి ప్రతినిధి, కాకినాడ: రాజకీయాల్లో నైతిక విలువలకు బొత్తిగా చోటు లేకుండా పోతోంది. నేతలు పార్టీలనే కాకుండా ఇచ్చిన మాటను, చేసిన ప్రకటనను కూడా ఫిరాయించేస్తున్నారు. అధికారం ఎటు వైపు ఉంటే అటే ఉంటామంటున్నారు. వైఎస్సార్ సీపీ ఎంతో నమ్మకం ఉంచి కాకినాడకు చెందిన కర్రి పద్మశ్రీకి గౌరవ ప్రదమైన శాసనమండలిలో స్థానం కల్పించింది. గవర్నర్ కోటాలో ఆమెకు మండలిలో సార్వత్రిక ఎన్నికల ముందు జగన్ మోహన్‌రెడ్డి ప్రాతినిధ్యం కల్పించారు. బీసీలలో పార్టీ ఆవిర్భావం నుంచి ఎంతోమంది సేవలందిస్తున్న సీనియర్‌లు ఉన్నప్పటికీ మత్స్యకార వర్గంలోని వాడబలిజ సామాజిక వర్గానికి చెందిన విద్యావంతురాలైన పద్మశ్రీని మహిళా కోటాలో అప్పటి కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి ఎమ్మెల్సీగా పార్టీ అధిష్టానానికి సిఫారసు చేశారు. పద్మశ్రీ గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యాక గత ఆగస్టు 30న కాకినాడ నగరపాలక సంస్థలో ఎక్స్ అఫిషియో సభ్యురాలిగా కొనసాగుతానని అప్పటి కలెక్టర్ కృతికాశుక్లాకు లేఖ అందజేశారు. ఎమ్మెల్సీగా ప్రమాణం చేశాక ఏడాది తిరగకుండానే పద్మశ్రీ ఎమ్మెల్సీ పదవికి, వైఎస్సార్ సీపీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే పద్మశ్రీ వైఎస్సార్ సీపీకి రాజీనామా చేశారు. పనులు చక్కబెట్టాలన్నా, లాబీయింగ్ చేయాలన్నా అధికార పార్టీలో ఉండాల్సిందేననే ధోరణితోనే ఎమ్మెల్సీ అటు వైపు ఫిరాయించారనే విమర్శలున్నాయి. పద్మశ్రీ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి రెండు నెలలు గడిచిపోయాయి. కారణాలేమైనా పదవులకు రాజీనామా చేసే ప్రజాప్రతినిధులు రాజీనామా చేసిన రోజు నుంచి అధికారిక హోదాను వదులుకుంటారు. రాజకీయాల్లో నైతిక విలువలు పాటించే వారెవరైనా ఇది అమలు చేస్తారు. అధికారంలోకి వచ్చిన అనంతరం తెలుగుదేశం సహా ఇతర పార్టీల నుంచి వైఎస్సార్ సీపీకి ఎవరు వచ్చినా పార్టీ, వారు అంతవరకూ అనుభవించిన పదవులకు రాజీనామా చేసి రావాల్సిందేనని ఆ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్మణ రేఖ గీశారు. ఆయా పార్టీల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులంతా దీన్ని పాటించే వైఎస్సార్ సీపీలోకి వచ్చారు.

విస్తుబోతున్న జనం

పద్మశ్రీ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా అంటే చేశారు తప్ప ఆ పదవి ద్వారా సంక్రమించిన గన్‌మెన్, ప్రొటోకాల్‌ను వదులుకోలేకపోతున్నారు. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు వంటి అధికారిక కార్యక్రమాలకు ఎమ్మెల్సీ హోదాలోనే హాజరవడంతో జనం విస్మయానికి గురవుతున్నారు. అక్టోబరు 21న పోలీసు అమరవీరుల దినోత్సవంలో ఎమ్మెల్సీ పద్మశ్రీ అధికారికంగా పాల్గొన్నారు. ఇటీవల కాకినాడ దుమ్ములపేటలో చెత్త నుంచి బయోగ్యాస్ ఉత్పత్తిచేసే ప్లాంట్‌కు శ్రీకారం చుట్టిన అధికారిక కార్యక్రమంలో ప్రొటోకాల్‌తో పద్మశ్రీ హాజరయ్యారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనలో మెకనైజ్డ్ బోట్ల యజమానులకు పరికరాల పంపిణీ కార్యక్రమంలో ప్రొటోకాల్‌తో పాల్గొన్నారు. పార్టీ వద్దనుకుని, ఎమ్మెల్సీ పదవి వద్దనుకుని రాజీనామా చేసినప్పుడు ఆ పార్టీ ద్వారా వచ్చిన ఎమ్మెల్సీ హోదాను ఎందుకు వదులుకోవడం లేదని పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు.

సముచిత గౌరవం కల్పించినా..

వైఎస్సార్ సీపీ మాత్రం ఎప్పుడూ నమ్మిన వారికి న్యాయం చేయడంలో ముందే ఉంటుంది. ఎస్సీ, బీసీలకు న్యాయం చేయడంలో వైఎస్సార్ సీపీ మొదటి నుంచి ఒక అడుగు ముందే ఉంటోంది. పార్టీలో విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచిన పిల్లి సుభాష్‌చంద్రబోస్‌కు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి కీలకమైన రెవెన్యూ మంత్రిని చేసింది. అనంతరం ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో తొలిసారి బీసీల నుంచి బోస్‌ను రాజ్యసభ సభ్యుడిని కూడా చేసింది. వైఎస్సార్ సీపీని నమ్ముకున్న వారికి ఏదో ఒక రోజు సముచిత గౌరవం దక్కుతుందని కర్రి పద్మశ్రీకి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎంపిక చేయడం ద్వారా మరోసారి నిరూపితమైంది. పద్మశ్రీ భర్త కర్రి నారాయణకు పార్టీలో రాష్ట్ర స్థాయి పదవులతో సముచిత ప్రాధాన్యం కల్పించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాక పూర్వం నుంచి ద్వారంపూడి వెంట ఉన్న నారాయణకు, ఆ వర్గానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ కోసం ద్వారంపూడి సిఫారసు చేశారు. ద్వారంపూడి వెంట ఉన్న నారాయణ 2014లో టీడీపీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీతో చెట్టపట్టాలేసుకు తిరిగారు. తిరిగి వైఎస్సార్ సీపీలోకి వచ్చిన నారాయణను నమ్మి అతని భార్య పద్మశ్రీని ఎమ్మెల్సీని చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో అధికారం కూటమికి దక్కడంతో మరోసారి నారాయణ, భార్య ఎమ్మెల్సీ పద్మశ్రీ కూటమి వైపు వెళ్లిపోయారు. ఎంతో నమ్మకం ఉంచి ఎమ్మెల్సీ పదవిని ఇస్తే ఆమె విశ్వాస ఘాతుకానికి పాల్పడ్డారంటూ వైఎస్సార్ సీపీ శ్రేణులు మండిపడుతున్నాయి. అధికారం ఎక్కడ ఉంటే అక్కడే ఉంటామంటున్న నేతల జాబితాలో కర్రి దంపతులు చేరిపోయారంటున్నారు.

డబ్బుకు అమ్ముడుపోవడం అన్యాయం



డబ్బుకు అమ్ముడుపోవడం అన్యాయం. డబ్బుకు అమ్ముడుపోవడంతోనే ఎమ్మెల్సీ రాజీనామా చేశారు. ఇది అతి పెద్ద వెన్నుపోటు. రాజకీయాల్లో ఎంతో మంది పార్టీలు మారుతుంటారు. అయితే కర్రి పద్మశ్రీ, భర్త నారాయణ వ్యవహారశైలి అత్యంత దారుణం. సాధారణ వ్యక్తిని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీని చేసి గౌరవిస్తే చివరకు డబ్బుకు ఆశపడి రాజీనామా చేయడం అన్యాయం. రాజీనామా చేశానంటూనే అధికారిక కార్యక్రమాలకు ఎలా హాజరవుతున్నారు. గన్‌మెన్‌లను వెంట పెట్టుకు తిరుగుతున్నారు. ప్రొటోకాల్ వదులుకోలేక పోతున్నారు.

– ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, కాకినాడ సిటీ